APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

09-05-2026
శనివారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 194
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

## తూకాలు వేయాలంటే.. లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి



2



## ఎస్ఐఆర్‌తో రాష్ట్రంలో ఓట్లు తొలగించేందుకు

# కుట్ర

ఇతర రాష్ట్రాల్లో జరిగిన విధంగా తెలంగాణలో జరగనీయవద్దు

ప్రస్తుతం వైట్ కాలర్ జాబ్స్ కంటే బ్లూ కాలర్ జాబ్స్‌కు డిమాండ్ ఎక్కువ

అమెరికా కంటే జర్మనీ, జపాన్‌లో ఎక్కువ ఉద్యోగావకాశాలు ఉన్నాయి

## రాజకీయ భిక్ష పెట్టిన గడ్డను

# మరువను

- దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నాం
- లగచర్లను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చుతున్నాం
- కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలి
- అప్పటివరకు మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీహరిలను నిద్ర పోనీయొద్దు
- ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదు
- ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన నాకుకు సీఎం పదవి దక్కింది
- కొడంగల్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్‌నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి

3



2

## తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి


- నేడు ప్రమాణ స్వీకారం.. కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం
- సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు
- ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్‌షా హాజరయ్యే అవకాశం



2

## మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది
- ఇప్పటికే ప్రభుత్వం 6.74 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసింది
- ప్రత్యేక అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి పనిచేయాలి: మంత్రి తుమ్మల



## మూసీ ప్రాజెక్టు.. తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు

- ప్రాజెక్టుపై చర్చించేందుకు సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం
- నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని సూచించిన మంత్రులు
- పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలి
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

## పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభను విజయవంతం చేయాలి


- తెలంగాణ లో రూ.8 వేల కోట్లు అభివృద్ధి పనుల శంఖుస్థాపనలకు శ్రీకారం
- ఈ సమావేశానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



2

## తమిళ రాజకీయాల్లో మరో ట్విస్ట్

- విజయ్ ప్రమాణస్వీకారంపై సందిగ్ధత!
- లోక్‌భవన్ నుంచి రాని అధికారిక ప్రకటన
- వీసీకే అధికారికంగా లేఖ ఇవ్వకపోడం వల్లే ఈ సందిగ్ధత నెలకొన్నట్లు సమాచారం
- బయటి నుంచే మద్దతు.. మంత్రివర్గంలో చేరమన్న లెఫ్ట్ పార్టీలు



2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# ఎస్ఐఆర్‌తో రాష్ట్రంలో ఓట్లు తొలగించేందుకు కుట్ర

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో తెలంగాణలో ఓట్లు తొలగించాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన విధంగా తెలంగాణలో జరగనీయవద్దని, అందరూ కలిసి కట్టుగా ఎదుర్కోవాలని మైనారిటీల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హజ్ వెళ్తున్న బస్సులకు సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సంక్షేమం, ఉద్యోగాల్లో మైనారిటీల వాటా వారికి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇరాన్, ఇరాక్ యుద్ధంతో పెరిగిన విమాన ఛార్జీల భారం హజ్ యాత్రికులపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. గతేడాది హజ్‌కు వెళ్లిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణిస్తే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇచ్చినట్లు ప్రస్తావించారు.



**ఈవీ ఆటోలుగా మార్చేందుకు సన్నాహాలు..**

ప్రస్తుతం వైట్ కాలర్ జాబ్స్ కంటే బ్లూ కాలర్ జాబ్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందన్న సీఎం, అమెరికా కంటే జర్మనీ, జపాన్‌లో ఎక్కువ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అందుకే ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో చాలా మంది మైనారిటీలు ఆటోలు నడుపుతున్నారని, ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని ఆటోలను ఉచితంగా ఈవీ ఆటోలుగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. తమకు హిందూ, ముస్లిం బేధాభిప్రాయం లేదని, హిందూ, ముస్లిం భాయిాభాయిా అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రోత్సాహకాలకు ప్రత్యేక కార్యక్రమం..**

అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సీఎం, ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీలకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి, వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా, జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలోనే మైనారిటీలకూ ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఆ కార్యక్రమానికి గ్రూప్స్‌నకు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు.

**ఖబరస్తాన్లకు భూ కేటాయింపు..**

గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3కి ఎంపికైన మైనారిటీల్లో ఆసక్తి ఉన్న వారికి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి, ఆ శాఖ పరిధిలోని అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భూమి అందుబాటులో ఉన్న చోట ఖబరస్తాన్‌లకు కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**మతసామరస్యాన్ని చాటేలా కట్టడాలుండాలి..**

మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాల సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్‌ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని సీఎం అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప కేంద్రాలుగా ఉండాలని ఆకాంక్షించారు. సమీక్షలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌లా దోచుకోవడం.. దాచుకోవడం మాకు తెలియదు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌లా దోచుకోవడం.. దాచుకోవడం తమకు తెలియదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టించారని అన్నారు. అలా హింసించడం తనకు తెలియదని వెల్లడించారు. అంతేకాదు.. మీలా డ్రగ్స్ తీసుకోవడం తనకు తెలియదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈరేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం కూడా తెలియదని హాట్ కామెంట్స్ చేశారు. ఇకనైనా కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేకపోతే పరిస్థితులు వేరేలా ఉంటాయని బండి సంజయ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ అహంకారం వల్లే కేసీఆర్ ఓడిపోయి ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారని తెలిపారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నా కూడా కేటీఆర్‌లో మార్పు రావడం లేదని.. ఇంకా అదే అహంకారం కనిపిస్తుందని విమర్శించారు. ఈనెల 10న పరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. 'తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.వేల కోట్ల నిధులిస్తోంది. కేంద్ర నిధులతోనే తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోంది. కేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందే అవకాశమే లేదు. ఢిల్లీ నుండి మేం నిధులు తెస్తుంటే.. కాంగ్రెసోళ్లు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్మును వాడుకుంటున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి సాధ్యం. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసం మోడీ వస్తున్నారు. తెలంగాణను అభివృద్ధి చేయడమే మోడీ నినాదం' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## మూసీ ప్రాజెక్టు.. తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డీపీఆర్ వివరాలను మంత్రులకు అధికారులు అందజేశారు. తొలిదశలో చేపట్టే పనులకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)తో చర్చలు ముగిశాయని ఉపసంఘానికి తెలిపారు. తొలిదశలో రూ.7,055 కోట్లతో మూసీ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

## మోడీ ద్వారానే చట్టసభల్లో రిజర్వేషన్ సాధ్యం

**హిమాయత్ నగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు తీసుకుంటుందని, కులగణన తరువాతే మోడీ ద్వారానే చట్టసభలలో రిజర్వేషన్ సాధ్యం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. శుక్రవారం కాచిగూడలో 13 బీసీ సంఘాల సమావేశానికి నీల వెంకటేష్, రాజేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం జనగణనలో కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించిందని, దీనిపై ఎటువంటి అనుమానాలు అవసరం లేదన్నారు. బీసీలకు జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో జనాభా ప్రకారం వాటా లభిస్తుందన్నారు. కులగణన కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం చారిత్రాత్మకమైన నిర్ణయం అన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు కులగణన చేయడానికి సాహసం చేయలేదని, 76 ఏళ్ల స్వతంత్రం తర్వాత కుల గణన చేసే సాహసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రం లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాన్ని ప్రకటించాలని కోరారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల ను 50 శాతానికి పెంచాలన్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్స్ పై క్రిమి లేయర్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక పాలసీ లో బీసీలకు 50 శాతం కోటా కేటాయించాలన్నారు. కేంద్రం లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు పర్ల గొర్ల మోడీ రాందేవ్, నిఖిల్ పటేల్, అశోక్, బలరాం, మల్లేష్ యాదవ్ , రాము తదితరులు పాల్గొన్నారు.

## తూకాలు వేయాలంటే.. లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి

**వీర్నపల్లి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పండించిన ధాన్యం తూకాలు వేసేందుకు రైతులు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. దేశం వదిలించుకున్న దారిద్ర్యాన్ని రాష్ట్రంలో నెత్తిన పెట్టుకున్నట్లు అయిందని కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. హామీలు, ప్రజా సంక్షేమాన్ని మరచి కుర్చీలు కాపాడుకునేందుకు ఢిల్లీకి మూటలు మోస్తున్నారని మండిపడ్డారు. సమ్మక్కసారలమ్మ జాతర పనుల్లో వాటాల కోసం మంత్రులు కొట్లాడుకున్నారని విమర్శించారు. కొత్త పథకాల సంగతి పక్కనపెడితే... ఉన్నవి కూడా తొలగిస్తున్నారని మండిపడ్డారు. మక్కల కొనుగోళ్లకు కనీసం గన్నీ సంచులు సరఫరా చేసే సోయి ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.నర్సంపేట ప్రాంతంలో వందల సంఖ్య వాహనాలతో మార్కెట్ల ఎదుట అన్నదాతలు పడిగాపులు కాస్తున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. భారాస హయాంలో అడగకుండానే రైతు బంధు వేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కేసీఆర్ సభ పెడితే... నెలకో ఎకరానికి కిస్తీల ప్రకారం రైతుబంధు పంపిణీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. 420 హామీలపై నిలదీస్తే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులకు జంకే ప్రసక్తే లేదన్నారు. జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే దమ్ము ప్రభుత్వానికి లేదని చెప్పారు. మత రాజకీయాలు తప్ప కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ప్రజా సంక్షేమం, రైతుల సమస్యలపై కనీస అవగాహన లేదని విమర్శించారు. ప్రభుత్వ నిధులతో యాదగిరిగుట్ట ఆలయాన్ని కట్టామని గుర్తు చేశారు. రామమందిర నిర్మాణంలో ప్రజా భాగస్వామ్యం మాత్రమే ఉందన్నారు.

## పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**శేరిలింగంపల్లి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పరేడ్ గ్రౌండ్స్ లో జరగబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే బీజేపీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ సన్నాహక సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనే ప్రసంగించారు. తెలంగాణ లో 8 వేల కోట్లు అభివృద్ధి పనుల శంఖుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. పెట్రోలియం ఉత్పత్తుల టెర్మినల్ ప్రారంభోత్సవం, బి బి నగర్ లో ఎయిమ్స్, కాజీపేట విజయవాడ 3 వ రైల్వే లైన్, కాజీపేట పెద్దపల్లి బైపాస్ లైన్ , రాష్ట్రానికి 5 వందే భారత్ ట్రైన్స్ కేటాయింపు తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్న ఈ సమావేశానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ అలె ప్రభాకర్ రాజ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ మోడీ మూడోసారి ప్రధానిగా గెలిచి తెలంగాణకు వస్తున్న సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు , మాజీ ఎమ్మెల్యే మారబోయిన భిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.



## తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో అమిత్‌షా సమక్షంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సువేందును బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా ) అమిత్ షా ప్రకటించారు. నేడు బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది.

**కౌన్సిలర్ స్థాయి నుంచి..**

సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 200609 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయిా (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయిా మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు.

**నందిగ్రామ్ ఉద్యమంతో..**

సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు.

**తృణమూల్ గూటిని వీడి..**

తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

## మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 1650 కోట్లతో 1.22 లక్షల మంది రైతుల నుండి 6.74 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసిందని, మొక్కజొన్న కొనుగోళ్లలో గోదాముల లభ్యత, హమాలీల కొరత, గన్నీబ్యాగుల లభ్యత, రవాణా అంశాల్లో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రమోహన్ తో చర్చించి మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లతో పాటు, వరిధాన్యం కొనుగోళ్లు కూడా విస్తారంగా జరుగుతున్నందున, కలెక్టర్లు మొక్కజొన్న కొనుగోళ్లలో కూడా బాధ్యత తీసుకొని, కొనుగోళ్లలో వేగం పెంచాలని కోరారు. మొక్కజొన్న కొనుగోళ్లలో కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మార్క్ ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లు, రవాణా సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. గోదాముల ఏర్పాటు, గన్నీ బ్యాగుల అందుబాటు, హమాలీల నియామకం, రవాణా సౌకర్యాల సమన్వయం వంటి అంశాలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, మార్క్ ఫెడ్ అధికారులతో కలిసి పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాముల వరకు రవాణాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి కోరడంతో వెంటనే రవాణా శాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ దిగుబడులను విక్రయించుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, జిల్లా యంత్రాంగం కొనుగోలు కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

**ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు..**

మొక్కజొన్న మార్కెట్ కు భారీ వస్తుండటంతో ఉమ్మడి జిల్లాల వారిగా రాష్ట్రస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ, వ్యవసాయశాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. డా. బి. గోపి, వ్యవసాయ సంచాలకులు వరంగల్, కరీంనగర్, రాహుల్ రాజ్ స్పెషల్ కమిషనర్ – మెదక్, ఖమ్మం జిల్లాలు, యాస్మీన్ బాషా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ఆదిలాబాద్, డా. కొర్ర లక్ష్మి నిజామాబాద్ లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది.

## నిజాంపేట్‌లో యాంకర్ సుమ కనకాల సందడి

**హైదరాబాద్ , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నిజాంపేట్‌లోని విజయ చాంబర్స్ లో వయ్యారీ శారీస్ తన మొదటి స్టోర్‌ను ప్రముఖ టెలివిజన్ యాంకర్ సుమ కనకాలతో కలిసి వ్యవస్థాపకుడు మనీదీప్ ఏచూరి మరియు డా. స్పందన మద్దుల ఘనంగా ప్రారంభించారు. ఈ కొత్త స్టోర్ ద్వారా నగర మహిళలకు తాజా, అందమైన, ట్రెండీ చీరల కలెక్షన్లు అందుబాటులోకి తీసుకువస్తోంది. వ్యవస్థాపకులు మనీదీప్ ఏచూరి, డా. స్పందన మద్దుల స్థాపించిన వయ్యారీ శారీస్, వారి విజయవంతమైన "వారాహి సిల్క్స్ అండ్ సిల్వర్ జ్యువెలరీ" ప్రయాణం నుంచి పుట్టుకొచ్చిన కొత్త ప్రయత్నం. ప్రీమియం విభాగంలో ప్రత్యేక గుర్తింపు సాధించిన తరువాత, మరింత విస్తృతమైన వినియోగదారులకు అందుబాటులో ఉండేలా, స్టైలిష్ మరియు నాణ్యమైన చీరలను సరసమైన ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఈ వయ్యారీ బ్రాండ్‌ను ప్రారంభించారు. వయ్యారీ ద్వారా సంప్రదాయ సొగసును రోజువారీ ఫ్యాషన్‌తో మేళవిస్తూ, ప్రతి మహిళకు అందమైన చీరలను చేరువ చేయాలని వారు సంకల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. దక్షిణ భారతదేశంలో 25కి పైగా స్టోర్లను ప్రారంభించే లక్ష్యంతో ఈ బ్రాండ్ వేగంగా విస్తరించేందుకు సిద్ధమవుతోందని. తమ ప్రత్యేకమైన కలెక్షన్లను మరింత మంది వినియోగదారులకు చేరవేయడమే వారి లక్ష్యం అన్నారు.



## తమిళ రాజకీయాల్లో మరో ట్విస్ట్

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తమిళనాడు రాజకీయాల్లో మరో ట్విస్ట్..! ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదు. శుక్రవారం సాయంత్రం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసిన టీవీకే చీఫ్ విజయ్ .. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరగా.. ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే, లోక్‌భవన్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాకపోవడంతో మళ్లీ అదే సందిగ్ధత కొనసాగుతోంది.ఇటీవల వెలువడిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు.. తొలుత కాంగ్రెస్, తాజాగా సీపీఐ, సీపీఎంతో పాటు వీసీకే పార్టీలు మద్దతు ప్రకటించడంతో మెజార్టీ మార్కును చేరుకున్నట్లయింది. వీసీకే అధికారికంగా లేఖ ఇవ్వకపోడం వల్లే ఈ సందిగ్ధత నెలకొన్నట్లు సమాచారం. అయితే, తాజా పరిణామాలపై స్పందించిన వీసీకే.. విజయ్‌కు మద్దతుపై క్లారిటీ ఇచ్చింది. ఇప్పటికే ఈమెయిల్‌లో లేఖ పంపామని.. శనివారం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేసింది.

**విజయ్ ప్రమాణస్వీకారం నేడేనా?**

మరోవైపు, శనివారం (మే 9న) ఉదయం 11గంటలకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేస్తారని సీపీఎం నేత కె .బాలకృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం ఎప్పుడు ఉంటుందనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

**వామపక్షాలకు విజయ్ థాంక్స్..**


గవర్నర్‌తో సమావేశం ముగిసిన వెంటనే విజయ్ నేరుగా చెన్నైలోని సీపీఐ, సీపీఎం కార్యాలయాలకు వెళ్లారు. తనకు మద్దతు ప్రకటించిన ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు కృతజ్ఞతలు చెప్పారు. మరోవైపు, ఇప్పటికే టీవీకేకు కాంగ్రెస్‌తో పాటు సీపీఎం, సీపీఐ మద్దతు తెలిపాయి.


**బయటి నుంచే మద్దతు.. మంత్రివర్గంలో చేరం: లెఫ్ట్**

టీవీకేకు బయట నుంచే తాము మద్దతిస్తామని.. ప్రభుత్వంలో చేరబోమని సీపీఎం నేత యు.వాసుకి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ''సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు ఈ రోజు సమావేశమయ్యాయి. టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు బయటి నుంచే మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాయి. అసెంబ్లీలో బల పరీక్ష సమయంలో టీవీకేకు మద్దతుగానే కచ్చితంగా ఓటు వేస్తాం. కానీ, మంత్రివర్గంలో మాత్రం చేరం. ఇది కేవలం బయటి నుంచి మద్దతే. వామపక్షాలు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని వీసీకే సైతం చెప్పింది. అందువల్ల వారు కూడా అదే తరహాలో వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం. ప్రజలు టీవీకేకు అధిక మెజార్టీ ఇచ్చారు.. వారి విశ్వాసం మేరకు ప్రభుత్వ ఏర్పాటు కోసమే మేం మద్దతు తెలుపుతున్నాం. ప్రజా సమస్యల ఆధారంగానే మేం స్వతంత్రంగా వ్యవహరించి పనిచేస్తాం. లౌకికవాదం, ప్రజల ఐక్యత, రాష్ట్రాల హక్కులు.. ఇలా ఇతర ఏ అంశమైనా సరే ప్రస్తావనకు వచ్చినప్పుడు మాతో కలిసొచ్చే ఏ లౌకిక పార్టీతోనైనా కలిసి నడుస్తాం'' అని తెలిపారు.

## 'సిటిజన్' ఫ్లాగ్‌షిప్ స్టోర్ను ప్రారంభించిన ఇండియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ శ్రీకాంత్

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సిటిజన్ వాచెస్ ఇండియా సంస్థ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, లేక్‌షోర్ మాల్‌లో ఎల్37 వద్ద తమ ప్రత్యేక ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రముఖ భారతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్ కిడాంబి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ వాచెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కావాటో ర్యోటా, అలాగే వ్యాపార భాగస్వామి కమల్ వాచ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ టోట్లా పాల్గొన్నారు. వారితో పాటు రవి కుమార్ టోట్లా, రాజేంద్ర టోట్లా, మాధవ్ టోట్లా కమల్ వాచ్ నుంచి, సందీప్ హెగ్డే, లక్ష్మీ కాంతన్ సిటిజన్ నుంచి, సామాజిక వేత్తలు సుధ జైన్, అనిఖ ఖరా, కవిత జైన్, మోడల్‌లు భవ్య చంద్రిక, సోనియా నాయుడు, ప్రాచీ ఠక్కర్, బిందు నూతక్కి హాజరయ్యారు. సిటిజన్ సంస్థ అభివృద్ధి చేసిన విప్లవాత్మక ఈకోడ్రైవ్ టెక్నాలజీకి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ ప్రారంభోత్సవం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. అదనంగా, ప్రముఖ లెగసీ వాచ్ బ్రాండ్ "బులోవా"ను కూడా ఈ స్టోర్‌లో పరిచయం చేయడం ద్వారా భారత మార్కెట్లో సిటిజన్ ప్రీమియం రిటైల్ ఉనికిని మరింత బలోపేతం చేసింది. కమల్ వాచ్ కంపెనీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ఈ కొత్త ఫ్లాగ్‌షిప్ స్టోర్, వినియోగదారులకు అత్యుత్తమ, ప్రత్యేకమైన షాపింగ్ అనుభూతిని అందించేందుకు రూపుదిద్దుకుంది. ఇక్కడ సిటిజన్ యొక్క ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇన్నోవేషన్, ఖచ్చితత్వం, నైపుణ్యాన్ని ప్రతిబింబించే విస్తృత కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.





# రాజకీయ భిక్ష పెట్టిన గడ్డను మరువను

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటనతో కొడంగల్ నియోజకవర్గం శుక్రవారం జనసంద్రమైంది. తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనుల జాతరకు శ్రీకారం చుట్టారు. సుమారు 10 వేల మందికి పైగా జనం తరలి వచ్చిన భారీ బహిరంగ సభలో ఆయన భావోద్వేగంగా ప్రసంగిస్తూ, కొడంగల్‌ను దేశంలోనే నంబర్ 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 'పేదల తిరుపతి'గా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.110 కోట్లభారీ బడ్జెట్‌తో శంకుస్థాపన చేశారు.6 ఎకరాల స్థలంలో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణం,18 నెలల్లో పనులు పూర్తి చేసి, తిరుమల తరహా అనుభూతిని భక్తులకు అందించడం.దీనితో పాటు దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 2.16 కోట్లు,కోస్గి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి రూ. 2 కోట్లు కేటాయించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల అయిన మెరుగైన వైద్యాన్ని చేరువ చేస్తూ, రూ. 255 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 430 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి సీఎం పునాది రాయి వేశారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అత్యాధునిక చికిత్సలు అందేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. "ఈ కొడంగల్ గడ్డ నాకు జన్మనిచ్చిన గడ్డ కాదు, కానీ రాజకీయ భిక్ష పెట్టిన గడ్డ. ఇక్కడి ప్రజల ఆశీస్సులే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. అందుకే రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆధ్యాత్మిక, వైద్య రంగాల్లో కొడంగల్‌ను అగ్రస్థానంలో నిలుపుతాను" అని అన్నారు. ముఖ్యమంత్రి రాకతో పట్టణంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లగచర్లను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చుతున్నామని చెప్పారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రి గారితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, వాకిటి శ్రీహరి గారు, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి గారు, మనోహర్ రెడ్డి గారు, పలువురు ప్రజా ప్రతినిధులు, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు గారు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి శైలజ రామయ్యర్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మిశ్రా, ఆర్ అండ్ బి ఈఎన్సీ మోహన్ నాయక్, సంగారెడ్డి ఎస్ఈ, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీపీఆర్వో చెన్నమ్మ , ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మెగా హారం ఫెస్ట్ లో మెరిసిన మోడల్స్

**హైదరాబాద్ , స్నేహిత ఎక్స్‌ప్రెస్:**అద్భుతమైన నైపుణ్యం, విశ్వసనీయ వారసత్వం, ప్రత్యేకమైన బ్రైడల్ కలెక్షన్లకు ప్రసిద్ధి చెందిన దేవి పవిత్ర గోల్డ్ & డైమండ్స్, నగరంలో ఇప్పటివరకు ప్రదర్శించని అత్యంత భారీ, ప్రత్యేకమైన హారాల కలెక్షన్‌ను కెపిహెచ్బి, పిఎన్ఆర్ ఎంపైర్ లోని స్టోర్ లో నిర్వహిస్తున వేడుకలో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫెస్ట్ లో ప్రదర్శనకు ఉంచే కలెక్షన్లను మోడల్స్ ధరించి ఫ్యాషన్ వాక్ చేసి ప్రదర్శించారు. ఈ మెగా హారం ఫెస్ట్‌లో 500కు పైగా ప్రీమియం హారాలు ప్రదర్శనలో ఉంచారు. సంప్రదాయ, ఆధునిక, యాంటిక్, టెంపుల్, నక్షి, విక్టోరియన్, బ్రైడల్ డిజైన్లలో విభిన్న శైలులు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్స్ జగదీష్, నాగ ప్రణీత్ మాట్లాడుతూ.. వినియోగదారులకు ఒకే చోట అసాధారణమైన జ్యువెలరీ షాపింగ్ అనుభవాన్ని అందించడంతో పాటు, గోల్డ్, డైమండ్ జ్యువెలరీ విభాగంలో తాజా ట్రెండ్స్, అత్యుత్తమ నైపుణ్యాన్ని పరిచయం చేయడమే ఈ ఫెస్ట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.



## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ను తెలంగాణ రాష్ట్ర డిజీపీ సి.వి. ఆనంద్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రి గారు కూడా శాలువా కప్పి సి.వి. ఆనంద్ ను అభినందించారు. పోలీసింగ్‌లో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అభిలషించారు.



# గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు ప్రభుత్వం సమ్మతి

- జగ్గారెడ్డి కోరిక మేరకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం అంగీకారం
- 3000 ఎకరాలకు గంగ కత్వ ద్వారా సాగునీరు
- దశాబ్దాలుగా ఆధునీకరణ కు నోచుకోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారుల తో సెక్రటేరియట్ లో సమావేశమైన జగ్గారెడ్డి
- గంగ కత్వ ఆధునీకరణ పనులకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో శంఖుస్థాపన




**హైదరాబాద్ , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలం లో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు , స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ.42 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్ లో జగ్గారెడ్డి సమావేశం అయ్యారు. గంగకత్వ కాలువకు చేపట్టబోయే ఆధునీకరణ పనులపై ఈ సమావేశం లో చర్చించారు.

**ఆధునీకరణ పనులు ఇలా...**

గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువ కు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జి ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

**సీఎం రేవంత్ రెడ్డి తో శంకుస్థాపన..**

సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సంగారెడ్డి కి రానున్న నేపథ్యం లో గంగకత్వ పనులకు సైతం సీఎం తో శంకుస్థాపన చేయించేందుకు జగ్గారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు త్వరత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గంగ కత్వ పనులకు శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి అధికారులకు వివరించారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com